# ఎప్పుడూ ఉంటారు

ఎండ మండుతోంది.

కుంపటి అంటించి కాఫీకి నీళ్ళు పెట్టి విసినికఱ్ఱ చేతిలోకి తీసుకుని కూర్చుంది శాంతమ్మ.

పెరట్లో కాకి తెగ అరుస్తోంది.

అలా కాకి అరిస్తే చుట్టా లొస్తారంటారు.

కానీ శాంతమ్మకి వీటిమీద నమ్మకం లేదు.

పక్కింటివాళ్ళ రేడియోలోంచి హిందీ పాటల హోరు శాంతమ్మకి చిరాకు కలిగిస్తోంది.

అసలే ఎండ చురచురలాడుతోంది. గాలిలేదు. ఉక్కపోతోంది. ఈ అవస్థ చాలక ఇంకా ఆ రేడియో గోలకూడా ఏమిటో అనుకుంది.

ఇంతలో ఒకళ్ళ వెనక ఒకళ్ళు పరిగెత్తుకుంటూ రానే వచ్చారు–పిల్లలిద్దరూ.

"చూడమ్మా, అది నా గోళీ తీసుకుంది." అంటూ చెల్లెలు చేతిలోది లాక్కోడానికి ప్రయత్నిస్తున్నాడు వాసు.

"ఒక్కసారి నా కిమ్మంటే యివ్వట్లేదమ్మా ! ఇందాకటినించీ తనొక్కడే ఆడుకుంటున్నాడు." అన్న మీద ఫిర్యాదు చేసింది పార్వతి.

"ఆ....అయినా నువ్వాడపిల్లవి, నీ కెందుకు కేంటి గోళీలు." ఆ మాటతో ఉలిక్కిపడింది శాంతమ్మ.

"ఏమిట్రా ? ఆడపిల్ల అయినంత మాత్రంలో అదేదో పాపం చేసినట్టు అలా మాటాడతా వెందుకూ ? ఊరికే ఇంటో గోళీకాయ అటూ ఇటూ దొర్లించి ఆడుకుంటే తప్పా ఏమిటి ? పొండి. ఇద్దరూ హాల్లో కూర్చుని ఆడుకోండి."

అమ్మ మందలింపుతో పిల్లలిద్దరూ గప్‌చిప్‌గా హాల్లో కెళ్ళి పోయారు.

"ఆడవాళ్ళని, నువ్వాడదానివి, నీ కెందుకు ?" అని దేన్ని గురించైనా ఎవరైనా అంటే శాంతమ్మ మనసు ఆదోలా అయిపోతుంది.

దానిక్కారణం తను పుట్టి పెరిగిన పరిస్థితులే. పుట్టింట్లో తనేం సుఖం అనుభవించింది ? అన్న ప్రశ్నకి ఇప్పటికీ సమాధానం వెతుక్కుంటూనే ఉంది.

అమ్మా, అమ్మమ్మా ఇద్దరూ కలిసి యింట్లోంచి బయటికి వెళ్ళకుండా కట్టుదిట్టాల్తో పెంచి పెద్దచేశారు.

స్కూల్లో చదువుకుంటానని ఎంతగానో ఏడ్చింది తను.

నీకెందుకమ్మా చదువులు. ఆడపిల్లవి. పెళ్ళిచేసుకుని ఇల్లు చక్కబెట్టుకుంటే చాలదూ ? అంటూ నీతులు బోధించేది అమ్మమ్మ.

"అన్నయ్య సినిమాకెళ్తా నన్నప్పుడల్లా పంపిస్తారు. నేనెప్పుడడిగినా వద్దంటారే ?" అని ఎన్నోసార్లు మొరపెట్టుకుంది.

వాడు మొగవాడు. ఎన్ని సినిమాలైనా చూస్తాడు. ఎక్కడైనా తిరిగొస్తాడు. నీకు వాడితో వంతేమిటి ?"—ఇదే అమ్మ దగ్గిర్నించి వినిపించే జవాబు.

అస్తమానం నువ్వాడదానివి అన్న మాటలే మోగుతుండేవి ఆ రోజుల్లో.

ఆడపిల్లగా పుట్టినందుకు ఏడుస్తూ కూర్చునేది ఎవరూ చూడ కుండా.

అందుకే ఒక ఉత్సాహంగానీ, ఉషారుగానీ, ఆశగానీ మచ్చుకైనా లేకుండా అమ్మ అమ్మమ్మల చెప్పుచేతుల్లో పెరిగి పెద్దదై పెళ్ళిచేసుకుని కాపరాని కొచ్చింది.

"కాఫీ అయిందా?"

భర్త పిలుపుతో ఆలోచనలు కట్టిపెట్టి అందరికీ కాఫీ గ్లాసుల్లో పోసింది శాంతమ్మ.

పిల్లలిద్దరూ వచ్చి తీసుకున్నారు.

భర్తకి కాఫీగ్లాసు అందించి తను కూడా కాఫీ తాగుతూ అక్కడే చాపమీద గోడ కానుకూర్చుంది. మనసు మాత్రం ఆలోచనల్లోంచి ఇవతలకి రాలేకపోతోంది.

మొగవాడు వాడికేం! ఏమైనా చేస్తాడు. ఎక్కడైనా తిరుగు తాడు. అని అస్తమానం అన్నయ్య ఎదుట అనడం వల్లకాదూ వాడి చదువలా చెడింది? ఎవరి మాటా వినకుండా, లక్ష్య పెట్టకుండా అందరి నెత్తీ ఎక్కి కూచోలేదూ? ఎంతసేపూ ఆటలూ, సినిమాలూ, తిరుగుళ్ళూ తప్ప చదువు మీద శ్రద్ధలేకపోయింది వాడికి. నేను మగవాడిని, నేనేం చేసినా చెల్లుతుంది అన్న భావం ఒకటి వాడి మనసులో గాఢంగా హత్తుకు పోయింది వాడికి. దానికి బాధ్యులు అమ్మా వాళ్లూ కాదూ? ఎలాగైతేనేం వాడిచేత హైస్కూల్ చదువు పూర్తి చేయించేసరికి ఒక యజ్ఞం చేసినంత పనైంది.

ఆ తర్వాత ఇంక చదువుకి పూర్తిగా స్వస్తి చెప్పాడు. తినడం తిరగడిమే పని. చదువుకునే వయస్సులో శ్రద్ధగా చదువుకో నందుకు తర్వాత ఎంతో బాధ పడ్డాడు.

అందుకే తనెప్పుడూ "నీకేం మొగవాడివి" అని కొడుకుని ఆకా శాని కెత్తదు.

"నువ్వాడదానివి నీ కెందుకు" అని కూతుర్ని కించపరచదు. ఎవర్నీ ఆ విధంగా అననివ్వదు కూడా. ఆయ నప్పుడప్పుడు, తనేదైనా విషయం గురించి వాదించబోతే ఆయనంటూ వుంటారు. "నీతో నేను వాదించను బాబూ! చదువుకోని వాళ్ళతో వాదించటం నాకు పరువు నష్టం."

నవ్వుతూనే ఆయన ఆ మాటలన్నా తను మనసులో ఎంతో బాధ పడుతుంది. అటువంటి పరిస్థితి తన కూతురికి రాకుండా చూసుకోవాలి. కాలేజీలో చదివించాలి.

"అమ్మగారూ!" పనిమనిషి కేకతో లేచింది శాంతమ్మ.

*　　　*　　　*

కొత్తగా కాలేజీలో చేరిన పార్వతి గబగబా కాలేజీ విశేషాలు చెప్తోంది తల్లితో, అన్నం తింటూ.

"మజ్జిగ పొయ్యి బాబూ! టైమైపోతోంది. మరే మా క్లాసులో లక్ష్మి అనే అమ్మాయుందమ్మా! ఆ అమ్మాయి కెంత గర్వం అను కున్నావ్! తనొక్కర్తే కాలేజీలో చదువు తున్నట్టూ, మే మెవరం చదవట్లేదన్నట్టూ చూస్తుంది .... బాబోయ్ టైమైపోయింది నేను వెళ్ళాలి" చెయ్యి కడుక్కొని లేచింది కబుర్లు చాలించి.

వంటింట్లో అన్నీ సద్దుకుని వచ్చి మంచం వాల్చుకుంది శాంతమ్మ. కూతురు చెప్పిన ఆ లక్ష్మి ఎవరోగానీ అలివేల్ని గుర్తుకు తెచ్చింది ఎప్ప టిదీ అలివేలు?

తనకి పదేళ్ళప్పుడు ఎదురింట్లో కొత్తగా వచ్చిన ప్లీడరుగా రమ్మాయితో పరిచయమైంది.

తన ఈడు పిల్లే అలివేలు. చక్కగా బళ్లో చదువుకుంటుండేది. కానీ ఎంత గర్వమనీ తనే కదా బళ్లో చదువుతోందవి....

ఆ పిల్లతో ఆడుకోడానికి వాళ్ళింటికి వెళ్తే ఎప్పుడూ తనతోటి ఆడేదే కాదు.

ఒక్కో రోజు కమలింటికి పోతున్నాననీ, ఒక్కోరోజు సుందరింటికి పోతున్నాననీ తుర్రుమనేది.

పైగా "కమలా, సుందరీ వాళ్లెవరూ నీకు తెలియదులే. వాళ్ళు కూడా నాతోటి బళ్ళో చదువుతున్నారు. నువ్వు బళ్ళో చదవట్లేదుగా! నీకు తెలియదు! అనేది గర్వంగా కళ్ళు తిప్పుతూ, తనకి కళ్ళమ్మట నీళ్లొచ్చేవి.

దిగులుగా యింట్లోకొచ్చి, అన్నయ్య ఏదైనా చేస్తుంటే వాడి పక్కన కూచుని చూడబోయేది తను.

"నా పక్కనెందుకూ చతికిల పడ్డావ్. ఇంట్లోకెళ్లి అమ్మకి పన్లో ఏం కావాలో చూడరాదూ?" అంటూ పురుగును విదిలించుకున్నట్టు విసుక్కునే వాడు అన్నయ్య.

ఎప్పుడైనా తను "గచ్చకాయలో, చింత గింజలో ఆడుకుందామా" అలివేలూ అంటూ ఎదురింటి కెళితే; ఏదో వికారం వచ్చినట్టు మొహం పెట్టి అనేదా పిల్ల "ఛీ.... అలాంటి ఆటలు నేనాడను."

"మరి ఎలాంటి ఆటలు ఆడతావని" తనెప్పుడూ అడగలేదూ, ఆ పిల్ల చెప్పా లేదు.

నవ్వొచ్చింది శాంతమ్మకి. ఇంకా పిల్లేమిటి? తన లాగే పెళ్ళయి కాపరం చేసుకుంటూ ఉండిఉంటుంది. తన ఈడుదేగా? ఇప్పుడెక్కడుందో ఏమో?

అలివేలుతోపాటు బళ్ళో చదివే పంతులు గారబ్బాయి వెంకట్రవణ కళ్ళల్లో మెదిలాడు.

ఎప్పుడైనా తను ఏమీ తోచక రవణతో కబుర్లు చెప్తే 'మగ పిల్లాడితో కబుర్లేవిటే నీకు! ఇంకెవరూ దొరకలా?' అంటూ రెక్క చ్చుకు యింట్లో కీడ్చుకువచ్చేది అమ్మ. పదేళ్ళ పిల్ల తను ఇంకో పదేళ్ళ పిల్లాడితో మాట్లాడితే తప్పా? రవణా వాళ్ళ నాన్నకి సంగీతం వచ్చు రవణకూడా అప్పట్లో నేర్చుకుంటూ ఉండేవాడు. గొంతు ఎంతో బాగుం దేది. రవణ పాట వినాలని తనకెంతో ఉండేది. పాడుతుంటే ఎదురుగా కూర్చుని చూడటం తనకి ముచ్చట.

కానీ ఎప్పుడూ అమ్మో, అమ్మమ్మో తయారై తనని ఇంట్లో కొచ్చేవరకూ చంపేవారు.

విననిచ్చేవారే కాదు.

ఎలాగైనా పూర్వకాలం ఆడవాళ్ళ పాలిట గడ్డుకాలం. కాలచక్రం గుండ్రంగా తిరిగి మళ్ళీ కొన్నాళ్ళకి ఆ కాలం రాదుకదా! ఆ మనుషులు తయారవరు కదా! నవ్వుకుంది శాంతమ్మ.

"చూడండి పిన్నిగారూ! మన చిన్నప్పుడు పొట్టి చేతుల జాకెట్లు తొడిగేవాళ్ళం.

మధ్యలో పొడుగాటి చేతులు ఫ్యాషనన్నారు. మళ్ళీ ఇప్పుడు చూశారా.... అంతా పొట్టిచేతుల జాకెట్ల మీదకే ఎగబడ్డారు" అని పక్కిం టావిడ నిన్ననే అంది.

నిజమే ఈ వరస చూస్తుంటే కాల చక్రం గుండ్రంగా తిరుగుతూ ఆచారాలూ, పద్ధతులూ అసలు రూపు మారిపోకుండా చూస్తోందని పిస్తుంది.

ఆవలిస్తూ పక్కకి తిరిగి పడుకుంది శాంతమ్మ ఆలోచనలాపి.

*　　*　　*

రోజులు గడిచాయి.

కూతురి పెళ్ళి చేసి, ఏడాది తిరిగే సరికల్లా మనవరాల్ని ఎత్తుకుంది శాంతమ్మ.

ఆ రోజు మధ్యాహ్నం అద్దంముందు కూర్చుని జడ వేసుకుంటోంది పార్వతి.

అక్కడే చాప మీద పక్కవేసి, మనవరాల్ని పడుకోబెట్టి కబుర్లు చెప్తోంది శాంతమ్మ.

"ఏమే! అమ్మలూ! నువ్వెంత వరకూ చదువుతావే! ఎమ్. ఏ. నా, డాక్టరవవుతావా!"

తల్లిమాటలకి నవ్వింది పార్వతి.

"దాన్నడిగితే అదేం చెప్తుంది? నన్నడుగు చెప్తాను. హైస్కూల్ చదువు పూర్తవగానే పెళ్ళి చేసేస్తాం దానికి."

"ఆ.... అలాగే అంటారు."

"కాదమ్మా! నిజంగానే చెప్తున్నాను, పెద్ద చదువులు చదివి అదేం చెయ్యాలి గనక? కాలేజీచదువు పూర్తిచేసి నేనేం వెలగబెడుతున్నాను!"

మరి మాట్లాడలేక పోయింది శాంతమ్మ.

దీన్నేం కట్టు దిట్టాల్లో పెంచి చెయ్యలేదే! మరి ఇలా మాటాడుతుందేమిటని మాత్రం ఆశ్చర్యపోయింది.

పరీక్షలైపోయిన ఆఖరి రోజు స్నేహితురాళ్ళతో కల్సి సినిమాకి వెళ్తానని పార్వతి అడగడం, ఆడపిల్లని ఒంటరిగా పంపించడ మేమిటి,

కావలిస్తే మనం తీసికెళదాం మనతో రమ్మను అని ఆయన అనడం; స్నేహితుల్తో కల్సి వెళ్తుంటే ఒంటరిగా అంటారేమిటి? అయినా దాని స్నేహితుల్తో వెళ్తే దాని కొచ్చే సరదా మనతో వస్తే ఉంటుందా అని చెప్పి తను ఆయన చేత సరే అనిపించడం; మా అమ్మ మంచిది. ఈ కాలం మనిషిలానే ఉంటుంది ఉద్దేశాల్లో అంటూ నవ్వుతూ పార్వతి తనని పొగడటం గుర్తొచ్చాయి శాంతమ్మకి.

అమ్మపేరు పెట్టుకోవడం వల్ల ఆవిడ ఉద్దేశాలే నిండాయా ఏమిటి దీని మనసులో? మనిషి ఈ కాలందీ మనసు అమ్మమ్మలనాటి కాలందీ అయింవా ఏమిటి?.... జడవేసుకోడం ముగించి పెరట్లోకి వెళుతున్న పార్వతి వంక చూస్తూ నవ్వుకుంది శాంతమ్మ.

"ఏమోలే.... ఇది పెద్దదయ్యేటప్పటికి అప్పుడు పరిస్థితులెలా ఉంటాయో! ఈ పిల్ల దానికొక్కొవల్సినట్టు తల్లిని లొంగదీసుకోదని ఏం నమ్మకం? దీని పెళ్ళయ్యాక దీని అభిప్రాయాలెలా ఉంటాయో అసలు.... కాలం మారింది, మారుతోంది అని ఊరికే అనుకోడం తప్ప అన్నిరకాల మనుషులూ అన్ని కాలాల్లోనూ ఉంటారు." తనకి తనే సర్ది చెప్పుకుని తృప్తిగా మనవరాల్ని ముద్దాడింది శాంతమ్మ.

★